

పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయ నిధి : డిప్యూటీ సిఎం

కడప : సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని, పేద ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం కొండంత భరోసానిస్తోందని ఉప ముఖ్యమంత్రి ఎస్. బి. అంజాద్ బాషా అన్నారు. శనివారం తన నివాస క్యాంపు కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ. 4 లక్షల 5 వేల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ పేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలవెన్నంటి ఉంటుందని తెలిపారు. తొలుత కడప నగరానికి చెందిన రజియా బేగం కు రూ. 1 లక్ష 50 వేలు, కె. నాగేశ్వరమ్మ కు రూ.70 వేలు, వేముల సుజాతకు రూ. 65 వేలు, సెక్రటేరి గ్రేస్ మెరిన్ కు రూ. 1 లక్ష, 20 వేలు మొత్తం రూ. 4లక్షల, 05 వేలు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నాగేంద్ర ప్రసాద్, అఖ్తరున్ ఖాన్, హరూన్ బాబు, నాయకులు సుబ్బారాయుడు, సి. రవి, సుధాకర్ లబ్ధిదారులు, పాల్గొన్నారు.

ప్రజా రక్షణభేరిని జయప్రదం చేయండి

పోస్టర్ ఆవిష్కరణలో సిపిఎం జిల్లా కార్యదర్శి

ప్రజాశక్తి - కడప అర్బన్

లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం నవంబర్ 1న కడప పాత బస్టాండ్ వద్ద నిర్వహించే ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం సిపిఎం జిల్లా కార్యాలయంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని విడగొట్టి పదేళ్లు పూర్తి కావస్తున్నా ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, కడప ఉక్కు పరిశ్రమ లాంటి విభజన హామీల్లో ఏ ఒక్కటి అమలు కాలేదన్నారు. రాష్ట్ర ప్రజల్ని నిలువునా మోసం చేసిన బిజెపి అంతటితో ఆగకుండా రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి గుండెకాయ లాంటి విశాఖ ఉక్కును తెగనమ్మడానికి తయారైందని విమర్శించారు. అన్నదమ్ముల్లా సఖ్యతగా మెలగవలసిన ప్రజల మధ్య బిజెపి విద్వేషాలు రెచ్చగొడుతుందని మైనారిటీలకు భద్రత లేకుండా పోతోందని కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్లను తెచ్చిందని తెలిపారు. రాష్ట్రాల హక్కుల్ని హరిస్తూ ఏకపక్షంగా నిర్ణయాలను రుద్దుతోందని విద్య, వైద్యం ప్రయివేటీకరించడం వల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజానీకానికి భారంగా మారిందని అన్నారు. ప్రభుత్వ రంగాన్ని, ప్రజల ఆస్తుల్ని అంబానీ, అదానీలకు దోచిపెడుతోందని తెలిపారు. ముఖ్యమంత్రి కార్పొరేట్ సేవలో తరిస్తున్నారని పేర్కొన్నారు. కృష్ణ పట్నం, గంగవరం మేజర్ పోర్టులతో పాటు రాష్ట్ర ప్రజల సంపదను ఒక్కొక్కటిగా అదానికి నైవేద్యం పెడుతున్నారని తెలిపారు. రాష్ట్రానికి ద్రోహం చేసి, విభజన హామీలకు ఎసరు పెట్టినా కేంద్రాన్ని పల్లెత్తు మాట అనే ధైర్యం లేనపుడు 151 మంది ఎమ్మెల్యేలు ఉన్నా ప్రజలకు, రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు రామ్మోహన్, మనోహర్, సుబ్బయ్య, దస్తగిరి రెడ్డి శ్రీనివాసులురెడ్డి, సత్యనారాయణ, అన్వేష్, శివకుమార్, చంద్రారెడ్డి, ఓబులేష్, సునీల్‌కుమార్ వెంకటసుబ్బయ్య, ఎమ్మార్ నాయక్, మహిళా సంఘం నాయకురాలు కామేశ్వరమ్మ పాల్గొన్నారు.

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో... జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ నవంబర్ 1న కడపలో జరిగే సభను జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ షేక్.సిద్ధిక్, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి ఓబులేసు తెలిపారు. కోచింగ్ సెంటర్ లో నిరుద్యోగ యువతీ యువకులను కలిసి కరపత్ర ప్రచారం నిర్వహించారు. **బద్వేలు :** పట్టణంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజా రక్షణభేరి బస్సు యాత్ర నవంబర్ 1న బద్వేల్ నాలుగు రోడ్ల కూడలిలో నిర్వహించే సభను జయప్రదం చేయాలని కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బద్వేల్ సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు పి.చాంద్‌బాషా ,పట్టణ కమిటీ సభ్యులు గిలక రాజు, గోపవరం మండల కన్వీనర్ ఎస్.ఖాదర్ బాషా, సిపిఎం నాయకులు, ఇ. రమణయ్య ఆకాశంద్రశేఖర్, మస్తాన్, పాల్గొన్నారు. **చాపాడు :** ప్రజాస్వామ్య పరిరక్షణ అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం తలపెట్టిన ప్రజా రక్షణ భేరి బస్సు జాతా ఈనెల 31న మైదుకూరు చేరుకోనున్న నేపథ్యంలో బహిరంగ సభను జయప్రదం చేయాలంటూ సిపిఎం ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య నగర్‌లో కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్ఎం షరీఫ్, సిపిఎం మండల నాయకులు గురవయ్య, బాలరాజు, సుధాకర్, జహంగీర్‌బాషా లక్ష్మీదేవి, మేరీ, శివ, పోలయ్య హరి పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం నవంబర్ 1న కడప పాత బస్టాండ్ వద్ద జరిగే ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని శనివారం జమ్మలమడుగు పాత బస్టాండ్‌లో పోస్టర్లు ఆవిష్కరించి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరనాల శివ నారాయణ, కార్యక్రమంలో సిపిఎం నాయకులు నరేంద్ర, స్వామి, ఒబులేశ్, బాషా పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్, నాయకులు

సిరులు కురిపించే పంట ఆయిల్ పామ్

- కలెక్టర్ వి.విజయ్ రామరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో సాగుబడికి అనువైన ఆయిల్ పామ్ పంట సాగు ద్వారా సిరులు కురిపించే దిగుబడితో పాటు, రైతులకు లాభదాయకమైన మార్కెటింగ్ సదుపాయం అందనుందని కలెక్టర్ వి.విజయ్ రామరాజు తెలిపారు. శనివారం కలెక్టరేట్ స్పందన హాలులో జిల్లా ఉద్యాన శాఖ, సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారి సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలో నూతన పంటగా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తూ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా జె కలెక్టర్‌తోపాటు రాష్ట్ర ఉద్యాన సలహాదారు పి. శివప్రసాద్ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు బలరామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నూతనంగా ఆయిల్ పామ్ పంటను సాగు చేసేందుకు ప్రోత్సాహం ఇస్తున్నట్లు తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాలోని బి.మఠం, మైదుకూరు, ప్రొద్దుటూరు, కాశినాయన, పులివెందుల మండలాల్లో మొత్తం 200 హెక్టార్లలో ఉద్యాన పంటగా ఆయిల్ పామ్ పంటను సాగు చేసేందుకు ప్రభుత్వం నిర్దేశించిందని చెప్పారు. ఎన్ఎంఇఒ - ఒపి పథకం ద్వారా ఈ పంట సాగుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహిస్తోందన్నారు. ఈ పంట సాగు ద్వారా రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరనున్నాయన్నారు. రైతులకు ప్రయోజనం చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా అనేక రాయితీలను ప్రకటించిందన్నారు. మొక్కల పెంపకం ఖర్చు నిమిత్తం దేశవాళీ రకానికి అయితే హెక్టారుకు రూ.20,000, విదేశీ రకానికి అయితే హెక్టారుకు రూ. 29,000లు ఇస్తున్నారన్నారు. ఎరువులు, అంతర పంటల సాగు నిర్వహణ కోసం నాలుగేళ్ల గాను హెక్టారుకు రూ.42,000 అందిస్తోందని తెలిపారు. డ్రిప్ పరికరాల కోసం రాయితీ మొత్తం వర్తిస్తుందని చెప్పారు. మొక్కలు నాటిన 4 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల వరకు నిరంతర ఆదాయాన్ని అందిస్తాయన్నారు. పంట సాగుకు ప్రభుత్వ రాయితీలు అందించడంతో పాటు పంట దిగుబడి వచ్చాయక దశలో ప్రమేయం లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే కంపెనీ వారి నుంచి నేరుగా ఫలసాయాన్ని కొనుగోలు చేస్తారని పేర్కొన్నారు. దాదాపు అన్ని రకాల నేలలకు ఈ పంట అనుకూలమని, నీరు నిలువని లోతైన ఒండ్రు నేలలు, అధిక సేంద్రీయ పదార్థం కలిగి, నీరు తేలికగా ఇంకిపోయే స్వభావాన్ని కలిగిన నేలలు ఈ మొక్కల సాగుకు అనుకూలం అన్నారు. ఎలాంటి బీడుభూమి బెడద లేని ఆయిల్ పామ్ ఎక్కువ దిగుబడికి సమృద్ధిగా సాగు నీరు అవసరం అవుతుందని తెలిపారు. వేసవికాలంలోనూ నీటి లభ్యత ఉన్న బోరు బావుల కింద సాగు చేసుకోవచ్చన్నారు. ఒక ఎకరం వరి సాగుకు అవసరమయ్యే నీటితో 3-4 ఎకరాల ఆయిల్ పామ్ సాగు చేయవచ్చన్నారు. ఆయిల్ పామ్ సాగు బడిలో అంతర పంటలను కూడా సాగు చేసుకుని రైతులు అదనపు ఆదాయాన్ని కూడా అందుకోవచ్చన్నారు. ఆసక్తి ఉన్న జిల్లా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం సబ్సిడీతో ప్రభుత్వం మంజూరు చేసిన ఆయిల్ పామ్ మొక్కలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ జీఎం పి.ఎం. కొండారెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రాజీవ్ మైఖేల్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి నాగేశ్వరరావు, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, ఔత్సాహిక రైతులు పాల్గొన్నారు.



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయ్ రామరాజు

వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయం : డిఆర్ఒ

ప్రజాశక్తి - కడప అర్బన్

వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయమని, వారి అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని డిఆర్ఒ గంగాధర్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బిసిల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. వాల్మీకి జీవితాన్ని మనం స్ఫూర్తిగా తీసుకుని వారి అడుగుజాడల్లో నడిచి తమ జీవిత లక్ష్యాలను ఉన్నతంగా తీర్చి దిద్దుకోవాలన్నారు. మొట్ట మొదటి శ్లోకం మనకు అందించిన మహనీయుడు మహర్షి వాల్మీకి అని కొనియాడారు. ఆది కవి వాల్మీకి రామాయణంలో దాదాపు 20 వేల శ్లోకాలు రాశారని, అందరూ వారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని దైనందిన జీవితంలో స్ఫూర్తితో జీవించాలన్నారు. వేల సంవత్సరాల కిందటే జ్ఞానం ఒకరి సొత్తు కాదని, కృషి చేస్తే జ్ఞాన సముపార్జన ఎవరికైనా సాధ్యమే అని, అది బోయ వర్గానికి చెందిన మహర్షి వాల్మీకి విషయంలో నిరూపితమైందని అన్నారు. ముందుగా వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ, సాధికార ఇంచార్జి అధికారి డి.క్రిష్ణయ్య, స్టెప్ సిఇఒ సాయి గ్రేస్, రాష్ట్ర హస్త కళల ఛైర్ పర్సన్ విజయలక్ష్మి, వాల్మీకి ఎంప్లాయిస్ అధ్యక్షులు శ్రీనివాసులు, బిసి మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున, పూలే విగ్రహ సాధన అధ్యక్షులు రమణయ్య, తలాడి కులము రాష్ట్ర ఉపాధ్యక్షులు సుంకర వాగేశ్వరరావు, ఎస్‌సి కులం మహా జన అధ్యక్షులు సంగటి మనోహర్, బిసి సంక్షేమ జాతీయ కార్యదర్శి చంద్రమౌళి, ఉద్యాన శాఖ రాష్ట్ర ప్రభు సలహాదారారు ఎన్.ప్రసాద్ రెడ్డి, సంఘ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఆర్ఒ గంగాధర్‌గౌడ్

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప

కమ్యూనిటీ వర్కర్స్, ట్రాన్స్ జెండర్స్ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ ఎం. ప్రదీప్ కుమార్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కడప నగరం ప్రకాష్ నగర్‌లో గల కమ్యూనిటీ సెంటర్‌లోకమ్యూనిటీ వర్కర్లకు, ట్రాన్స్ జెండర్స్ కు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాల సద్వినియోగ విషయంలో ఏవైనా సందేహాలు ఉంటే సలహాలు సూచనలకై జిల్లా న్యాయ సేవధికార సంస్థ వారిని సంప్రదించాలన్నారు. ప్రీ లిటిగేషన్ కేసులు, జాతీయ లోక్ అదాలత్‌ల పైన అవగాహన కల్పించారు. రాజీ మార్గమే రాజ మార్గమని చెప్పారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మండల న్యాయ సేవా సమితి విధివిధానాలు తెలియజేశారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ దృష్టికి తీసుకొని రావచ్చును అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డిఎంహెచ్ఒ రవి బాబు, డిస్టిక్ ప్రోగ్రాం మేనేజర్ భాస్కర్, సిడిఎస్ కడప ,పులివెందుల ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్. ఏసురత్నం, సిడిఎస్ పులివెందుల మేనేజర్ వలి, సిడిఎస్ కడప, ఎంఇసిఎ పెంచలయ్య, పిసి ఎస్ ఎస్ మేనేజర్ స్వాతి, సిఆర్‌డిఎస్ మేనేజర్ నరేష్, కమ్యూనిటీ వర్కర్స్, ట్రాన్స్ జెండర్స్ పాల్గొన్నారు.

ఆల్ ఇండియా పోస్టల్ కబడ్డీ జట్టుకు జనార్ధన ఎంపిక

ప్రజాశక్తి - కడప

ఈనెల 30 నుంచి నవంబర్ 4 వరకు కేరళ రాష్ట్రంలోని ఎర్నాకులంలో నిర్వహించే 35వ ఆలిండియా పోస్టల్ కబడ్డీ పోటీలలో పాల్గొనే జట్టుకు టి. జనార్ధన ఎంపికయ్యాడు. వరుసగా 4వ సారి ఆంధ్రప్రదేశ్‌లో కడప జిల్లా పోస్టల్ కడప డివిజన్, ఎర్రముక్కపల్లి, మామిళ్ళపల్లి బ్రాంచి పోస్ట్ ఆఫీస్ లో ఎపిపిఎంగా పనిచేస్తున్న టి. జనార్ధన ఆంధ్రప్రదేశ్ పోస్టల్ కబడ్డీ జట్టుకు ఎంపిక కావడం పట్ల కడప జిల్లా పోస్ట్ ఆఫీస్ సూపరింటెండెంట్ రాజేష్, ఇన్‌స్పెక్టర్ సౌత్ డివిజన్ సుబ్బరాయుడు అభినందనలు తెలిపారు. గతంలోనూ కేరళలోని కొల్లంలో, 2017 చెన్నైలో 2022 హిమాచల్ ప్రదేశ్ లోని సిమ్లాలో జరిగిన ఆల్ ఇండియా పోస్టల్ జట్టుకు ఎంపిక ఎంపికై ఆడారు. ఎర్రముక్కపల్లి పోస్టుమాస్టర్ దర్బార్ బాష, పిఎ రామకృష్ణారెడ్డి, మామిళ్ళపల్లి బ్రాంచి పోస్టుమాస్టర్ ఎం.ఈశ్వర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్ ప్రదానం


ప్రజాశక్తి - కడప అర్బన్

కెఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ షేక్. ఇలియాస్ అలికి వేలూరు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. 'ఎ స్టడీ ఆన్ ద ఇన్ఫ్లుయెన్స్ ఆఫ్ ఇండియన్ డయాస్పోరా ఫిక్షన్ అండ్ మూవీస్ ఆన్ ఫస్ట్ ఇయర్ బీ టెక్ స్టూడెంట్స్' అనే వ్యాసం సమర్పించి ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ రాజేశ్వరి, ఎమ్‌డి డాక్టర్. కె చంద్ర ఓబుల్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం వి.రత్నమ్మ, అధ్యాపక బృందం, అధ్యాపకేతర బృందం, విద్యార్థినులు ప్రత్యేకంగా డాక్టర్. ఇలియాస్ అలికి అభినందనలు తెలిపారు.

రాపిడ్ చెస్ టోర్నీలో కడప క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి - కడప

బెంగళూరు నగరంలోని వైట్ ఫీల్డ్ ప్రాంతంలో ఉన్న మంజునాథ కల్యాణమండపంలో శనివారం నిర్వహించిన 48వ బిఆర్‌డిసిఎ జాతీయస్థాయి రాపిడ్ చెస్ టోర్నమెంటులో కడప నగరానికి చెందిన చెస్ క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. బహుమతులు సాధించిన వారిలో అండర్-7 బాలికల విభాగంలో అమీనా ఐదవ స్థానం లో నిలిచింది. అండర్-9 బాలికల విభాగంలో లక్ష్మి మను శ్రీ 5వ స్థానంలో, షణ్ముఖ కశ్వి 6వ స్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నారు. అండర్- 11 బాలికల విభాగంలో ఖ్యాతిమ ఏడవ స్థానంలో నిలిచింది. అండర్ -15 బాలికల విభాగంలో తేజోమయి ఆరవ స్థానంలో నిలిచింది. 50 సంవత్సరాల పైబడిన విభాగంలో అనీస్ దర్బారి మొదటి స్థానంలో నిలిచి రూ. 1000 నగదు బహుమతిని అందుకున్నారు. యంగెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ బహుమతిని నితారా ఆర్వి (నీతు) సాధించింది. కాగా ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రదీప్‌చంద్రరెడ్డి 4 పాయింట్లు, అభిరాం రెడ్డి 2.5 పాయింట్లు చరిత్ 2.5 పాయింట్లు సాధించి రాణించారని అనీష్ దర్బారి తెలియజేశారు.



పతకాలు సాధించిన క్రీడాకారులు

ప్రజా ప్రయోజిత సమస్యలకు శాశ్వత పరిష్కారం

కడప : ప్రజా ప్రయోజత, న్యాయ సేవలకు సంబంధించిన వివాదాలను శాశ్వత లోక్ అదాలత్ పరిష్కరిస్తుందని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఎ సెక్రటరీ ఎం. ప్రదీప్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో ప్రజాప్రయోజిత, న్యాయ సేవలపై అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ శాశ్వతలోక్ అదాలత్‌లో రవాణా సేవలు, పోస్టల్ టెలిఫోన్ సేవలు, విద్యుత్ సరఫరా కాంతి, నీరు సేవలు, ప్రజా సంరక్షణ, పారిశుధ్యం సేవలు, విద్యాసంస్థలు, హౌసింగ్, రియల్ ఎస్టేట్ సేవల గురించి అధికారులకు వివరించారు. శాశ్వత లోక్ అదాలత్, పార్టీల మధ్య వివాదంలో ఉన్న విషయాన్ని సామరస్య పూర్వక పరిష్కారం ద్వారా లేదా అర్హతల ఆధారంగా పరిష్కరిస్తారని చెప్పారు. లోక్ అదాలత్‌లు సంబంధిత జిల్లా ప్రధాన కార్యాలయంలో న్యాయసేవాసదన్ భవన సముదాయాలలో పనిచేస్తునాయని చెప్పారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

11 వరకు విధులు బహిష్కరణ : రాఘవరెడ్డి

ప్రజాశక్తి - కడప

బార్ కౌన్సిల్ మొండి వైఖరిని నిరసిస్తూ నవంబర్ నెల 11 వరకు న్యాయవాదులు విధులు బహిష్కరిస్తున్నట్లు కడప బార్ అసోసియేషన్(న్యాయవాదుల సంఘం) అధ్యక్షులు జి.వి. రాఘవరెడ్డి తెలిపారు. ఆ మేరకు శనివారం సాయంత్రం కడప జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాలులో నిర్వహించిన సమావేశంలో తీర్మానం చేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పిటిషన్ పైన, ఐఎలపైన రూ. 20 లు న్యాయవాదుల సంక్షేమ నిధి స్టాంపు అతికించాలని బార్ కౌన్సిల్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసనలు తెలుపుతున్నారన్నారు. బార్ కౌన్సిల్ తమ మొండి వైఖరి కొనసాగిస్తూ వారి ఇష్టం వచ్చిన రీతిలో నిర్ణయాలు తీసుకుంటూ న్యాయవ్యవస్థకు విఘాతం కలిగేలా పరిస్థితిని తీసుకొచ్చారన్నారు. బార్ కౌన్సిల్ చైర్మన్ వెంటనే పదవి నుంచి వైదొలగాలని డిమాండ్ చేస్తూ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. విషయాన్ని హైకోర్టు వారు సుమోటోగా స్వీకరించి రాష్ట్రంలోని న్యాయవాదులకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు.




మాట్లాడుతున్న రాఘవరెడ్డి

. నెలాఖరులోపు ఉపాధి పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి- కడప

జిల్లాలో అమలవుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2022-23 వరకు ప్రారంభించిన పనులను ఈ నెలాఖరులోపు పూర్తి చేసి వెబ్ సైట్ లో నమోదు చేయాలని సంబంధిత అధికారులను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి నాగార్జున రెడ్డి ఆదేశించారు. జిల్లాలో అమలవుతున్న మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పిఎంకెఎస్‌వై 2.0 కార్యక్రమాలపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. నాగార్జున రెడ్డి శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంజిఎన్ఆర్ఇజిఎ పథకం కింద ఇప్పటివరకు 5,573 కుటుంబాలకు వంద రోజులు పని దినాలు కల్పించామన్నారు. ఈ సంఖ్యను పెంచుతామని చెప్పారు. పిఎంకెఎస్ వై 2.0 పథకం కింద నవంబర్ 15 లోపు పనులన్నీ పూర్తి చేసి, మిగిలిన నిధులను ఖర్చు చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలోని పులివెందుల, బద్వేలు, ఎర్రగుంట్ల డబ్ల్యూ సిసిల పరిధిలోని సహజ వనరుల యాజమాన్య కార్యక్రమం కింద ఇప్పటివరకు 383 పనులు పూర్తయ్యాయని ఇంకా 249 పనులు పూర్తి కావాల్సి ఉన్నాయని చెప్పారు. ఉత్పాదకత పెంపుదల కింద ఇప్పటివరకు 2895 మంది రైతులకు వ్యవసాయ పరికరాలు పంపిణీ చేశారన్నారు. ఇంకా 103 మంది రైతులకు వ్యవసాయ పరికరాలు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. వీరికి నాణ్యమైన వ్యవసాయ పరికరాలను వారంలోపు సరఫరా చేయాలన్నారు. సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు పి. యదుభూషణ రెడ్డి, జిల్లాలో పనిచేస్తున్న అదనపు పథక సంచాలకులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

ఐడిపిఎస్ విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

అథ్లెటిక్స్ పోటీల్లో భారతదేశం తరపున ఆడిన కడప ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పతకాలు సాధించాలని డైరెక్టర్ ఎం. వివేకానంద రెడ్డి తెలిపారు. శనివారం పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నుంచి 30 మంది విద్యార్థులు ఎంపిక కాగా ఇందులో 11 మంది విద్యార్థులు ఐడిపిఎస్ ఉన్నారని పేర్కొన్నారు. ఈనెల 10 నుంచి నాలుగు రోజులపాటు నేపాల్ దేశంలో నిర్వహించిన పోటీల్లో విజయం సాధించాలని తెలిపారు. రెండు స్వర్ణ, వెండి, ఐదు రజిత పతకాలు సాధించారని చెప్పారు. నితిన్ గోల్డ్ మెడల్, మణికంఠ సిల్వర్, గణేష్ బ్రాంజ్, ఖుషి వర్ధన్, చరణ్, నరసింహులు బ్రాంజ్ మెడల్స్ సాధించారని పేర్కొన్నారు. యూత్ గేమ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు అమర్ సింగ్ నేతృత్వంలో అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేశారని తెలిపారు. తమ విద్యార్థులు పథకాలు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పోటీలకు అవసరమైన శిక్షణతో ముందుకు వెళ్తామని క్రీడాకారులు ఆశాభావం వ్యక్తం చేశారు.




పతకాలు సాధించిన విజేతలతో వివేకానందరెడ్డి

ఆర్‌డిని కలిసిన ఎన్‌జిఒ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కడపలో వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ జి. రత్నకుమారి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కడప ఆర్‌డి కార్యాలయంలో ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసులు, కార్యదర్శి డి. రవికు మార్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రస్తుతం ఉద్యోగుల అర్హత ఉన్న కేడర్‌కు ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. దీనిపై ఆర్‌డి సానుకూలంగా స్పంది ంచారు. కార్యక్రమంలో జిల్లా సహా అధ్యక్షులు తిమ్మారెడ్డి, కోశాధికారి నిత్య పూజయ్య, ఉపాధ్యక్షులు బాలపులయ్య, బ్రాహ్మనందరెడ్డి, సొసైటీ డైరెక్టర్ జి. వెంకటరెడ్డి, సిటీ అధ్యక్షులు చిన్నయ్య, కార్యదర్శి శైలేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



ఆర్‌డిని సన్మానిస్తున్న ఎన్‌జిఒ నాయకులు

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

కడప : ఈనెల 29న సెలవు దినం అయినప్పటికీ జిల్లా వ్యాప్తంగా విద్యుత్ బిల్లుల వసూల్ కేంద్రాలు యథాతథంగా పనిచేస్తాయని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఆదివారం విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు పనిచేస్తాయని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి కావాలంటే 'బాబు'ను గెలిపించాలి

కడప అర్బన్ : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేయాలని టిడిపి సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి అమీర్ బాబు, మన్మోహన్ రెడ్డి తెలిపారు. 48వ డివిజన్‌లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానికంగా నివసించే హిజ్రాలతో పాటు, పలువురు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యంలా బయటికి రావడం ఖాయం అన్నారు. వైసిపి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలో భాగంగా బాబును జైల్లో పెట్టిందని విమర్శించారు. 2024 ఎన్నికల్లో వైసిపిబుద్ధి చెప్పేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారని తెలిపారు. టిడిపి ప్రచారానికి బ్రహ్మారథం పడుతున్నారని పేర్కొన్నారు. ఎలాంటి నేరం చేయకపోయినా బాబును జైలుకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు మాట్లాడుతూ ప్రజలు టిడిపిని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఓబుల్ రెడ్డి, కొండ సుబ్బయ్య, ఏలియా పాల్గొన్నారు

మండల అభివృద్ధికి సహకరిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చెన్నూరు

మండలాభివృద్ధికి తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని కమలాపురం శాసన సభ్యులు పోచంరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. శనివారం మండల సభా భవనంలో ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, నాడు - నేడు, జగనన్న సురక్ష, రైతు భరోసా కేంద్రాలు, తదితర కార్యక్రమాల వల్ల ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దేశంలోనే ఉత్తమ ముఖ్యమంత్రిగా పేరు పొందారని చెప్పారు. మండలంలోని ప్రతి కుటుంబానికీ లబ్ధి చెందేలా కార్యక్రమాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. మైనార్టీ, ఎస్‌సి, ఎస్‌టి, బిసి అన్ని వర్గాలకు ప్రయో జనం జరిగేలా అనేక పథకాలు అమలు చేస్తున్నారని ఆయన అన్నారు. కార్యక్ర మంలో ఎంపిడిఒ డి. సుబ్రహ్మణ్యంశర్మ, తహశీల్దార్ పటాన్ అలీఖాన్, వైస్ ఎంపీపీ చిన్న (ఆర్ఎస్ఆర్), సొసైటీ ప్రెసిడెంట్ అల్లి శ్రీరామ్మూర్తి, సర్పంచులు ఎస్‌సి నారాయణరెడ్డి, కల్యాణ్, సుదర్శన్ రెడ్డి తుంగ చంద్ర, ఎంపిటిసిలు నాగిరెడ్డి, అధికారులు, విఆర్‌ఎలు మురళి, రామలింగారెడ్డి, అన్ని శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

యువ జంటను కాపాడిన పోలీసులు

కడప : రాయచోటికి చెందిన యువ జంట కుటుంబ సమస్యలతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. వారిని శనివారం పోలీసులు కాపాడారు. యువ జంట ఇటీవలే ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నారు. కుటుంబ సమస్యలతో ఇద్దరూ చనిపోవాలని నిర్ణయం తీసుకుని శుక్రవారం కడప రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. ప్లాట్ ఫామ్‌పై అనుమానస్పదంగా ఉండడంతో గుర్తించిన ఓ వ్యక్తి వన్‌టౌన్ స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ ఎ.ప్రభుకు సమాచారం అందించారు. వెంటనే రైల్వే స్టేషన్ సమీపంలో విధుల్లో ఉన్న బ్లూ కోల్ట్ సిబ్బందికి సమాచారం చేరవేశారు. క్షణాల్లో రైల్వే స్టేషన్‌కు చేరుకొని రైలు పట్టాల వైపు వెళ్తున్న ఇద్దరిని ఆపి ప్రాణాలు రక్షించారు. వారి వివరాలు ఆరా తీశారు. క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకోవాలనుకున్న వారికి జీవితం ఎంత విలువైందో వివరించారు. అనంతరం 'దిశ' పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి బంధువులకు అప్పగించారు.

రూ. 5 లక్షల వరకు ఆరోగ్య చికిత్సలు

కలసపాడు : ప్రధానమంత్రి యోజన పథకం కింద మండలంలో సుమారు 3400 మంది లబ్ధిదారులకు ఆరోగ్య యోజన పథకం కింద రూ. 5 లక్షల వరకు ఉచిత ఆరోగ్య చికిత్సలు చేసుకోవచ్చని ఎంపిడిఒ మహబూబ్‌బీ తెలిపారు. శనివారం ఆమె సచివాలయ పంచాయతీ సెక్రటరీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న సురక్ష యోజన పథకం, భారత్ ఆయుష్మాన్ ప్రధానమంత్రి జన్ అయోగ్య పథకం కింద అనేక మందికి వైద్య సదుపాయాలను ప్రభుత్వం కల్పించిందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యశ్రీ కార్డులను వాలంటీర్ల ద్వారా ఇంటింటికి పంపిణీ చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి మురారి పాల్గొన్నారు.

చర్చి స్థలాన్ని కాపాడాలని వినతి

కడప : చర్చి స్థలాన్ని కాపాడాలని కోరుతూ శనివారం చింతకొమ్మదిన్నె తహశీల్దార్‌కు ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ కడప జిల్లా అధ్యక్షులు రెవరెండ్ మల్లెం విజయభాస్కర్, శమ్మ మినిస్ట్రీ అధ్యక్షురాలు అమ్ములు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లెం విజయ భాస్కర్ మాట్లాడుతూ సికె దిన్నె మండలం పరిధిలోని చెర్లోపల్లి గ్రామంలో సర్వే నంబర్ 158/5ఎ 45 సెంట్లు స్థలం ఉందని, అందులో 10 సంవత్సరాల నుండి ప్రార్థనలు చేసుకుంటున్నారని, ఆ స్థలాన్ని ఎద్దుల పుష్పరాజు 2015 సంవత్సరంలో చర్చి నిర్మించుకునేందుకు దానవిక్రయం అగ్రిమెంట్ ద్వారా రాయించి ఇచ్చారని తెలిపారు. వారి అన్నదమ్ములు జీర్ణించుకోలేక పదేళ్ల తరువాత ఇప్పుడు దౌర్జన్యంగా చర్చి పైకి దాడికొస్తున్నారని తెలిపారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

ఘర్షణలు జరిగితే తెలియజేయండి : సిఐ రాజు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్


సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ సిఐ రాజు

ఘర్షణలు జరిగితే తెలియజేయాలని మహిళా సంరక్షక కార్యదర్శులకు పట్టణ పోలీస స్టేషన్ సిఐ రాజు ఆదేశించారు. ఎస్పి సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మహిళ సంరక్షక కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మీ పరిధిలో ఏ చిన్న సంఘటన జరిగినా వెంటనే సమాచారం ఇవ్వాలని, చిన్న విషయమే కదా అని తేలికగా తీసుకోవద్దని సూచించారు. సమాచారం వెంటనే తెలుపడం వల్ల నేరం జరగకుండా అరికట్టవచ్చన్నారు. ఒకవేళ అప్పటికే నేరం జరిగివుంటే దాని తీవ్రతను తగ్గించడంతోపాటు, ఆ ఫలితంగా మరొక నేరం పునరావృతం కాకుండా చూడవచ్చని వివరించారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి మహిళా పోలీసు వారి పరిధిలో విధులు నిర్వహించాలని ఆయన కోరారు.

నేడు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణ పరిధిలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు మానస నృత్య కళా కేంద్రం ధర్మవరం చిన్నారులచే క్లాసికల్, జానపద నృత్యాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

జాతీయ స్థాయిలో మెరిసిన యోగానంద

ప్రజాశక్తి - చాపాడు



మైదుకూరు మండలం యాపరాలపల్లె గ్రామానికి చెందిన కశెట్టి చంద్రమోహన్, శ్రీదేవి కుమారుడు యోగానంద జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. యోగానంద ప్రస్తుతం బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. జాతీయస్థాయి అండర్-14 క్రికెట్ పోటీలో మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో అత్యంత ప్రతిభ కనబరిచి గోవాలో జరిగే జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. ఓ సాధారణ గ్రామస్థాయి క్రీడాకారుడు జాతీయస్థాయికి ఎంపిక కావడం పట్ల యోగానంద కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అండర్-19 ఖోఖో పోటీల్లో 'బీరం' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఖాజీపేట


ప్రతిభ చూపిన విద్యార్థులు

మండలంలోని కొత్త నెల్లూరు సమీపంలో ఉన్న బీరం శ్రీధర్ రెడ్డి పాఠశాల విద్యార్థులు అండర్-19 ఖోఖో క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల యాజమాన్యం శనివారం తెలిపింది. సిబిఎస్ఇ సౌత్‌జోన్, క్లస్టర్స్ అండర్-19 ఖోఖో పోటీలు హైదరాబాద్‌లోని సాయి ప్రకాష్ విద్యానికేతన్ స్కూల్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో బీరం శ్రీధర్‌రెడ్డి విద్యాసంస్థల విద్యార్థులు జాతీయస్థాయి సౌత్‌జోన్ క్లస్టర్స్‌లో మూడవ స్థానాన్ని దక్కించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల అధినేత బీరం సుబ్బారెడ్డి, చైర్‌పర్సన్ సరస్వతమ్మ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు ఖోఖో పోటీల్లో గెలిచి తమ విద్యాసంస్థల కీర్తి పతాకాన్ని ఎగురవేశారని కొనియాడారు. విద్యాసంస్థల డైరెక్టర్ బీరం స్వాతి, శ్రీకాంత్ విద్యార్థులను, పిఇటిలను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్వేత, కళాశాల ప్రిన్సిపల్ హేమ్ చందర్, పిఇటిలు పాల్గొన్నారు.

చదువుతోనే పేదరిక నిర్మూలన : పిఒ

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

సమాజంలో అన్ని దానాల్లోకెల్లా విద్యాదానం గొప్పదని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.


విద్యార్థులకు సూచనలిస్తున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డి

మండలంలోని రేకల కుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శని వారం ఆయన సందర్శిం చారు. విద్యార్థులతో సమావేశంలో ప్రభా కర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజం మరింత పురోగతి చెందాలన్న, కుటుంబాలలో పేదరికం పోవాలన్నా చదువు ఒక్కటే మార్గమ న్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో చదవాలని సూచించారు. పాఠ్య పుస్తకాలే కాకుండా సమాజం గురించి తెలుసు కోవాలన్నారు. భవి ష్యత్తులో రాణించాలంటే చదువుపై మనసు, దృష్టి పెట్టాలన్నారు. సున్నిత మనస్తత్వాన్ని విడనాలని సూచించారు. ఆత్మవిశ్వాసం, ధైర్య సాహ సాలతో ప్రయత్నించాలని ఆయన సూచించారు. ప్రధానోపాధ్యాయులు సుబ్బా రాయుడు, ఉపాధ్యాయులు శశిధర్, శ్రీనివాసులు, ఉమా మహేశ్వరరావు, ఓబు లేసు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గుర్రప్ప, చక్రపాణి, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో వ్యవసాయశాఖ ఉందా..?

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి

రాష్ట్రంలో వ్యవసాయ శాఖ ఉందా అని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రశ్నించారు. స్థానికంగా తన కార్యాలయంలో శని వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్‌లో వర్షాలు లేక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. శ్రీశైలంలో నీళ్లు లేక పంటలు ఎండిపోయే పరిస్థితిలో ఉన్నాయన్నారు. కెసి కెనాల్ నీరు రాక ఆ పరిధిలో రైతులు మెట్ట పంటలు వేశారని, అవి కూడా ఎండి పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. లక్ష ఎకరాల్లో పంట ఎండిపోతున్నా ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తోందన్నారు. రైతుల ఇబ్బందులు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పట్టించుకునే పరిస్థితిలో లేరన్నారు. ముఖ్యమంత్రి రైతు కాదని, ఒక బిజినెస్‌మ్యాన్ అని పేర్కొన్నారు. గ్రామాల్లో మంచినీటి వనరుల్లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతుంటే భూగర్భ జలాలు పెంచే ఆలోచన చేయడం లేదన్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న వేసవిలో ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. సామాజిక సాధికార బస్సు యాత్రతో ఒరిగేదేంలేదని విమర్శించారు. ప్రొద్దుటూరులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేసిన ద్రోహం వారు మర్చిపోలేదన్నారు. ప్రొద్దుటూరు బీసీ నేత నందం సుబ్బయ్యను చంపారని, దీనికి వైసిపి బస్సుయాత్రలో సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, టిడిపి మాజీ పట్టణ అధ్యక్షుడు ఘంటసాల వెంకటేశ్వర్లు, పెన్షనర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు శివారెడ్డి, టిడిపి నేతలు వద్ది బాలుడు పాల్గొన్నారు.

చంద్రబాబుపై కేసులు శోచనీయం

వేంపల్లె : స్కిల్ డెవలప్‌మెంట్‌లో అక్రమాలు జరిగాయని టిడిపి నేత చంద్రబాబును 50 రోజులుగా జైలులో పెట్టడం శోచనీయమని టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఆధారాల్లేకుండా చంద్రబాబును జైలులో పెట్టడం జగన్ నియంతృత్వానికి పరాకాష్ట అన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు చంద్రమౌళి నాయుడు, పివి రమణ, గోటూరు నాగభూషణం, ఇలియాస్, రామసుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సాగు, తాగు నీటికి ఇబ్బందుల్లేకుండా చూడాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

సాగు, తాగునీటికి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి సూచించారు. శనివారం ఎంపిపి టి.లక్ష్మమయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులతో కేసి కెనాల్‌కు నీరు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతులు ఆరుతడి పంటలు సాగు చేస్తున్నాంన్నారు. ఆరుతడి పంటలకు నీరు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇప్పటికే ఉన్నతాధికారులతో చర్చించామని ఎమ్మెల్యే తెలిపారు. నవంబర్ మొదటి వారంలో, చివరి వారంలో కేసి కాలువకు నీరు విడుదలయ్యేలా చూస్తామన్నారు. వ్యవసాయానికి ఇబ్బందులు లేకుండా 7 గంటలకు తగ్గకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. గ్రామపంచాయతీ నిధులను కేవలం తాగునీటికి మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే పాలశీతలీకరణ కేంద్రాన్ని చాపాడులో కాకుండా అధికంగా పాలు ఉత్పత్తి అయ్యే గ్రామంలో ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పదవ తరగతి ఫలితాల్లో చిన్న గురువలూరు హైస్కూల్‌లో 32 శాతం మాత్రమే విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం ఏమిటని ఎంఇఒను ప్రశ్నించారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని గ్రామీణ ప్రాంత విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, తహశీల్దార్ యామిని, ఎఒ మ్యాగీ, ఈఓపీఆర్డీ రాధాకృష్ణ వేణి, ఎంఇఒ రవిశంకర్, ఐసిడిఎస్ సిడిపిఒ సావిత్రమ్మ, ఉపాధి ఏపిఒ జగదీశ్వర్‌రెడ్డి, పిఆర్ ఏఈ ఈశ్వరయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భరత్‌కుమార్ రెడ్డి, హౌసింగ్ ఏఈ శాంతి, వైద్యాధికారి ఓబులేసు, పశువైద్య అధికారి మహమ్మద్ గౌస్, విజయ్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బిఎల్‌ఒల పనితీరు భేష్

నూతన జాబితాలో అభ్యంతరాలుంటే తెలపవచ్చు : ఇఆర్‌ఒ

ప్రజాశక్తి -పులివెందుల రూరల్


సమావేశంలో మాట్లాడుతున్న ఇఆర్‌ఒ వెంకటేశులు

విధుల నిర్వహణలో బిఎల్‌ఒల పనితీరు సక్రమంగా ఉందని ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి వెంకటేశులు పేర్కొన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు అధికారులకు పని చేయాలని అలా కాకుండా ఎవరైనా విధులు సక్రమంగా నిర్వహించకపోతే వారిపై చర్యలు తీసుకోవడం తప్పదని ఆయన హెచ్చరించారు. ఎంపిడిఒ సభ భవనంలో శనివారం ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి వెంకటేశులు సమక్షంలో అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా వచ్చిన ఓటర్ల జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే తెలపవచ్చని తెలిపారు. ఏమైనా అభ్యంతరాలుంటే డిసెంబర్ 9కి మార్చే వీలుంటుందన్నారు. వచ్చే ఏడాది జనవరి 5న పూర్తి ఓట్ల జాబితా వస్తుం దన్నారు. నవంబర్ 4,5.. డిసెంబర్ 2,3 తేదీల్లో పోలింగ్‌స్టేషన్లో వద్ద ప్రత్యేక క్యాంపులను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎఇఆర్ఇ, సింహాద్రిపురం, తొండూరు, లింగాల, తహశీల్దార్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోవాలి


ప్రజావేదికలో సిబ్బందికి సూచనలిస్తున్న అడిషనల్ పీడీ నాగరత్నమ్మ

ప్రజాశక్తి - వేంపల్లె

ఉపాధి పనులను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని డ్వామా అడిషనల్ పీడీ నాగరత్నమ్మ చెప్పారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో 2022 ఏప్రిల్ నుండి 2023 మార్చి నెలాఖరు వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై 17వ విడత చేసిన సామాజిక తనిఖీ అంశాలపై ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయితీల వారీగా డిఆర్పీలు పనుల వివరాలు, ఖర్చయిన మొత్తాన్ని కూడా జిల్లా ఉన్నతాధికారులకు నివేదికను చదివి వినిపించారు. అలాగే సామాజిక తనిఖీ బృందాలు పరిశీలించి గుర్తించిన అవకతవకలపై కూడా అధికారుల దృష్టికి తెచ్చారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం సామాజిక తనిఖీలు చేస్తున్నట్లు నాగరత్నమ్మ చెప్పారు. పంచాయతీ రాజ్ , ఉపాధిహామీకి సంబంధించి 1725 పనులకు గాను రూ 115010484 కోట్ల ఖర్చు చేసినట్లు ఎస్ఆర్ పి మూర్తి తెలిపారు. చెప్పారు. కొత్తగా ఫేక్ హాజరుకు చెక్ పడేలా చర్యలు చేపట్టినట్లు అడిషనల్ పిడి నాగరత్నమ్మ చెప్పారు. ఆయా గ్రామాల్లో జరిగిన పనుల్లో కొలతల్లో తేడాలపై ఉపాధి హామీ సిబ్బందితో చర్చించారు. బాధ్యతగా పని చేయాలని హెచ్చరించారు. బాధ్యతగా పని చేయకపోతే సమస్యలు ఉత్పన్నం అవుతాయన్నారు. పనులు జరిగే సమయంలో తనిఖీలు చేపట్టాలని సూచించారు. ఉపాధి పనుల్లో అవినీతి చేస్తే రికవరీ చేస్తామని హెచ్చరించారు. పనులు నాణ్యతగా చేయించి సకాలంలో కూలీలకు డబ్బులు చెల్లించాలన్నారు. భూగర్భ జాలాలు నిల్వ ఉండేలా రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో జరిగే గ్రామ సభల్లో ఉపాధి సిబ్బంది విధిగా హాజరుకావాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి, విజిలెన్స్ డిఇఇ యోగాంజనేయురెడ్డి, ఎపిడి సుబ్బారెడ్డి, ఉపాధి ఎపిఒ చంద్రశేఖర్, ఉపాధి సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, సామాజిక తనిఖీ బృందాలు పాల్గొన్నారు.

బడుగులకు రాజ్యాధికారం కల్పించింది జగనే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు


మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం అంజద్‌బాషా

ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీలకు రాజ్యాధికారం కల్పించి వారికి అగ్రపీఠం వేసింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పలువురు వైసిపి నాయకులు పేర్కొన్నారు. సామాజిక సాధికార బస్సు యాత్ర శనివారం రాత్రి ప్రొద్దుటూరుకు వచ్చిన సందర్భంగా స్థానిక శివాలయం సర్కిల్‌లో ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ ముఖ్యమంత్రి అంజద్‌బాషా మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు 14ఏళ్ల పాలనలో చేసిందేమీలేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఈ నాలుగున్నర కాలంలో సామాజిక విప్లవం తీసుకొచ్చి సమసమాజ స్థాపనకు కృషి చేశారన్నారు. జగన్ పత్రికలు, ఛానెళ్లను నమ్ముకోలేదన్నారు. ఆయన నమ్ముకున్నది పేదలనే అని తెలిపారు. రాజ్యసభ ఎంపీ బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ బిసిలకు రూ.లక్షా62వేల కోట్లు సంక్షేమ పథకాల ద్వారా ముఖ్యమంత్రి జగన్ అందించారన్నారు. బిసిలను చట్టసభలలో గౌరవంగా కూర్చొబెట్టింది వైసిపి ప్రభుత్వమే అన్నారు. కర్నూలు మాజీ ఎంపీ బుట్టా రేణుక మాట్లాడుతూ మహిళలకు సముచిత స్థానం కల్పించి ఆర్థికభరోసానిచ్చిన పార్టీ వైసిపి అన్నారు. జగనన్నను మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ జగనన్న పేదల కోసం బటన్ నొక్కారని, ఇప్పుడు ప్రజలు ఫ్యాన్ గుర్తుకు బటన్ నొక్కాలన్నారు. కార్యక్రమంలో తిరుపతి ఎంపీ గురుమూర్తి, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడారు. ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గంలో రూ.3,300కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలి



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీరించాలని, పనికితగ్గ వేతనం ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శనివారం స్థానిక మున్సిపల్ మస్టర్ పాయింట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి శేఖర్, సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్ మాట్లాడుతూ 20ఏళ్లుగా చాలీచాలని నామమాత్రపు వేతనాలతో, ఉద్యోగ భద్రత లేకుండా కార్మికులు దుర్భర జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి ఎదుగు బొదుగులేని బానిస బతుకులు బతుకుతున్నారని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 6 నెలల్లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని జగన్ ప్రతిపక్షనేతగా అసెంబ్లీలో, పాదయాత్రలో ఇచ్చిన హామీని గుర్తు చేశారు. ఈనెల 21న 114వ జిఒ ద్వారా 10,117 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తున్నట్లు ప్రకటించారని, ఇందులో ఒక్క మున్సిపల్ కార్మికుడు కూడా లేరని తెలిపారు. ఇప్పటికైనా తమ న్యాయమైన డిమాండ్లను సిఎం తీర్చాలని వారు కోరారు. లేదంటే కాలంలో రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా జిల్లా కమిటీ సభ్యులు నాగన్న, కోశాధికారి శివన్న, పట్టణ మున్సిపల్ యూనియన్ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పులివెందుల మార్కెట్‌లో చీనీకి అధిక ధరలు

పులివెందుల టౌన్ : పులివెందుల మార్కెట్‌లో చీనీ కాయలకు అధిక ధరలు వస్తున్నాయని మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప పేర్కొన్నా రు. శనివారం అత్యధికంగా టన్నుకు రూ.40,600 ధర పలికిందన్నారు. మార్కెట్‌కు 47.94 టన్నులు వచ్చాయని, కనిష్టంగా రూ.17 వేలు, గరిష్టంగా రూ.40,600 పలికిందని తెలిపారు. ఈ నెలలో 3426.24 టన్నుల వ్యాపారం జరిగిందని, అత్యధికంగా ధర పలకడం ఇదే మొదటి సారి అన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వ్యాపార రావడంతో వ్యాపారుల మధ్య పోటీ పెరిగి, ధరలు పెరిగాయని వివరించారు. దళారుల వ్యవస్థను రూపుమాపాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మార్కెట్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఇలాగే దళారీ వ్యవస్థ లేకుండా రైతులకు మంచి ధర వచ్చేలా కృషి చేస్తామని చిన్నప్ప తెలిపారు.

1న రాష్ట్రావతరణ నిర్వహించడం సమంజసం కాదు

వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నవంబర్ 1న నిర్వహించడం సమంజసం కాదని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని అక్టోబర్ 1న జరపడం వల్ల అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మకు శాంతి కలుగుతుందన్నారు. తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని 1952 అక్టోబర్ 19న పొట్టి శ్రీరాములు మద్రాసులో ఆమరణ నిరాహారదీక్ష చేపట్టారన్నారు. ఆయన ఆత్మ బలిదానంతో 1953 అక్టోబర్ 1న రాయలసీమ, కోస్తాంధ్రతో కూడిన ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, రామకృష్ణ, ధృవకుమార్‌రెడ్డి, నరసింహారెడ్డి, బద్రి, రాఘవయ్య, ఉత్తన్న, వేమయ్య, శివ, సుబ్బరాయుడు, రవి, వినయ్ పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

పులివెందుల రూరల్ : వాల్మీకి జయంతి వేడుకలను పట్టణంలో తాలూకా అధ్యక్షుడు అంబకపల్లె బాలుడు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పాల్‌రెడ్డి ఫంక్షన్ హాల్ సమీపంలో ఉన్న వాల్మీకి సంఘం కార్యాలయంలో నిర్వహించారు. వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు వాల్మీకి గొప్పతనం గురించి మాట్లాడారు. బాలుడు మనోహర్‌రెడ్డిని, వరప్రసాద్‌ను దుశ్శాలువాతో సత్కరించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, వాల్మీకి సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

ప్రజాశక్తి - వేంపల్లె


అంగన్‌వాడీ టీచర్‌తో సమస్యలపై చర్చిస్తున్న రహంతుల్లా

స్థానిక పంచాయతీ పరిధిలోని ఫక్కీర్‌పల్లెలో ఉన్న అంగన్వాడీ వద్ద పారిశుధ్య పనులు చేపట్టాలని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా కోరారు. శనివారం ఫక్కీర్‌పల్లెలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని ఆ పార్టీ నాయకులు సందర్శించారు. అక్కడ ఉన్న సమస్యలను రహంతుల్లా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలు ఉండే అంగన్వాడీ కేంద్రం వద్ద చెత్త దిబ్బాలు తొలగించకపోవడం బాధాకరమన్నారు. దోమలు విపరీతంగా ఉండడంతో పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. పారిశుధ్యం అధ్వానంగా ఉందన్నారు. పంచాయతీ అధికారులు పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు దాదాపీర్, సమీర్, గౌస్ బాషా, పీర్, సిరాజ్ పాల్గొన్నారు.

శామ్యూల్ చిత్ర పటానికి నివాళులు

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరుకు చెందిన ఎపిఎస్‌పి కానిస్టేబుల్ శామ్యూల్ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయి అమర వీరుడయ్యారని సిద్దవటం 11వ బెటాలియన్ ఆర్ఐ రాజు కొనియాడారు.


శామ్యూల్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అధికారులు

స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఆర్ఐ ఆధ్వర్యంలో శ్యామూల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శామ్యూల్ కానిస్టేబులుగా 11వ బెటాలియన్లో విధులు నిర్వహిస్తు 2005లో మావోయిస్టుల చేతిలో ప్రాణాలు కోల్పోయారన్నారు. ప్రతి ఏడాది అమరవీరులను స్మరించుకుంటూ పోలీస్ శాఖ తరపున అమర వీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శామ్యూల్ కుటుంబాన్ని పోలీస్ శాఖ తరపున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి లక్ష్మీ నరసింహులు, సర్పంచ్ కుమారుడు ప్రశాంత్, కుటుంబ సభ్యులు, ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రావెల్ రోడ్డు వద్దని వినతి

ప్రజాశక్తి - దువ్వూరు



ఎంపిడిఒకు వినతిపత్రమిస్తున్న సర్పంచ్, ప్రజలు

స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులో గ్రావెల్ రోడ్డు వేశారని, ఆ రోడ్డు వద్దని ఎంపిడిఒ జగదీశ్వర్‌రెడ్డికి శనివారం సర్పంచ్ చిన్నరాయుడు, స్థానికులు వినతి పత్రం సమర్పించారు. గ్రావెల్ రోడ్డు వేశారని, ఇది చాలా అధ్వానంగా తయారైందని వివరించారు. వర్షం వస్తే ఇంకా ఇబ్బందిగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుందన్నారు.

అరాచక పాలనకు చరమగీతం పాడాలి

ప్రజాశక్తి - చాపాడు

రాష్ట్రంలో పెరిగిపోతున్న అరాచక పాలనకు చరమగీతం పాడాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ పిలుపునిచ్చారు.


ప్రజలకు అభివాదం చేస్తున్న పుట్టా సుధాకర్ యాదవ్

శనివారం మడూరు గ్రామంలో బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కసారి అవకాశం ఇవ్వండి అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తామని జగన్ ప్రజలను మభ్య పెట్టారని విమర్శించారు. నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెంచారని తెలిపారు. అన్యాయంగా కేసులు బనాయిస్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అన్యాయంగా జైల్లో పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.. ప్రజల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోందని, రాబోయే ఎన్నికల్లో టిడిపి విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండలశాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, బి.మఠం మండల అధ్యక్షుడు సుబ్బారెడ్డి, మిల్లు శ్రీను, నాయకులు నారపరెడ్డి, నారా యణరెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి, లక్ష్మీ నారాయణరెడ్డి, వెంకట రమణారెడ్డి, క్రిష్ణారెడ్డి, రవింద్ర, లోకేశ్వర్‌రెడ్డి, మోహన్, సుధాకర్, సుబ్బారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫిర్యాదులొస్తే చర్యలు : ఎస్ఇ

ప్రజాశక్తి - చాపాడు

వినియోగదారుల నుంచి ఫిర్యాదులొస్తే చర్యలు తప్పవని ఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ రమణ సిబ్బందిని హెచ్చరించారు. మైదుకూరు సబ్ డివిజన్‌లోని చాపాడు, వనిపెంట, ఖాజీపేట సబ్‌స్టేషన్‌లను ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఇ రమణ మాట్లాడుతూ ప్రజలు, రైతులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంతరాయం ఏర్పడుతున్న లైన్లను గుర్తించి మరమ్మత్తులు చేపట్టాలన్నారు. రైతులకు 7 గంటలపాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇఇ రామిరెడ్డి, డిఇఇ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

కలమల్ల-ఎర్రగుంట్ల మధ్యనున్న నాపరాయి క్వారీల వద్ద అస్సుబాయ్ గారి రహీమన్ (39) అనే వ్యక్తి శనివారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు శనివారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు నిర్ధారించారు. రహీమాన్ నిడుజివ్వి గ్రామానికి చెందిన వ్యక్తిగా రైల్వే పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభు త్వాసు పత్రి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.